క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్, ఎస్పీ



ఏలూరులో హైకోర్టు జడ్జి సురేష్ రెడ్డికి పూల మొక్కను అందజేస్తున్న కలెక్టర్ కె.వెట్రి సెల్వి

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె. సురేష్ రెడ్డి ఆదివారం ఏలూరు జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కోర్టు ఆవరణలో న్యాయమూర్తుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా కోర్టుకు వచ్చిన సందర్భంగా ఆదివారం కలెక్టర్ కె వెట్రి సెల్వి, ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ



రామారావుగూడెం పోలీస్ డాగ్‌తో తనిఖీ

దెందులూరు: రామారావుగూడెం రైస్‌మిల్లు బాత్‌రూమ్‌లో శనివారం రాత్రి ఓ వ్యక్తి (50) మృతదేహాన్ని పోలీసులు కనుగొన్న సంగతి విదితమే. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ కథనం ప్రకారం తణుకు మండలం ఉండ్రాజవరం గ్రామానికి చెందిన తూము రాంబాబు గోనె సంచులు కుట్టు పని చేస్తుంటాడు. మిల్లులోని బాత్‌రూమ్‌లో రాంబాబు మృతి చెందాడని మిల్లు యజమాని ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్టు ఎస్సై తెలిపారు. ఆదివారం ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో రైస్‌మిల్లు, బయట రోడ్డు, లోపలి భాగం, చుట్టుపక్కల ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. మృతుడితోపాటు అక్కడ ఉండే వారందరి వేలిముద్రలు నమోదు చేశారు. మృతుని తల్లి, అన్న, కుటుంబ సభ్యులతో మాట్లాడి అతడి ఆరోగ్య పరిస్థితి, జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బోరుగడ్డ అనిల్‌పై కేసు నమోదు

ఏలూరు టౌన్: బోరుగడ్డ అనిల్‌కుమార్ 2023 అక్టోబర్‌లో తనకు ఫోన్ చేసి వ్యక్తిగత దూషణలు చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని పేర్కొంటూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు అనిల్‌పై కేసు నమోదు చేశారు.

అసంపూర్తిగా పేదల ఇళ్లు

- మొండిగోడలు, బేస్‌మెంట్లు దర్శనం
- జగనన్న కాలనీల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.91 కోట్లు లబ్ధిదారులకు అందజేత



కోమడవోలు జగనన్న కాలనీలో బేస్‌మెంట్ స్థాయిలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం



పోణంగి జగనన్న కాలనీలో అసంపూర్తిగా గృహ నిర్మాణాలు



బిల్లులు రాకపోవడంతో లక్ష్మీపురం జగనన్న కాలనీలో ఆగిన గృహ నిర్మాణం

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం హయాంలో పేదల సొంతిల్లు ఆశలు అడియాశలయ్యాయి. ఇంటి నిర్మాణానికి ప్రస్తుతం ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. కనీసం ఇసుక, ఐరన్, సిమెంట్ అందించండి బాబూ అంటే, లబ్ధిదారులు వేడుకుంటున్నా వినే వారు కానరావడం లేదు. దీంతో గంపెడు ఆశతో ఇల్లు కట్టుకుందామనుకున్న పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన జగనన్న కాలనీ నిర్మాణ పనులు నేడు ఎక్కడకక్కడే నిలిచిపోయాయి. మూడేళ్లు యజ్ఞంలా సాగిన గృహ నిర్మాణ పథకం నేడు నిర్వీర్యమైంది. జగనన్న కాలనీల్లో ఎక్కడ చూసినా మొండి గోడలతో, పునాదుల దశలో దర్శనమిస్తున్నాయి. నాలుగు నెలలుగా కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో వేగంగా గృహ నిర్మాణం

వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల సొంతిల్లు పనులు చురుగ్గా సాగాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్క గృహ లబ్ధిదారుడికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. నిర్మాణ పనులు మరింత సులువుగా సాగేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు లబ్ధిదారుల చెంతకే ఐరన్, కంకర, ఇసుక సైతం అందించారు. నేడు కూటమి ప్రభుత్వ పాలనలో అంతా తారుమారైంది. ఇసుక అందని ద్రాక్షగా మారింది. సిమెంట్, ఐరన్ రేట్లు భారీగా పెరిగిపోయాయి. కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా జగనన్న కాలనీల్లో పనులు నిలిచిపోయాయి.

గతంలో క్రమం తప్పకుండా బిల్లుల మంజూరు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగాయి. ఏలూరు నియోజకవర్గంలో ముగ్గురు, దెందులూరులో నలుగురు హౌసింగ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్లు పనులు పరివేక్షించారు. వీరితో పాటు గ్రామ సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సైతం ఇళ్ల నిర్మాణంపై ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించారు. ఫలితంగా వైఎస్సార్‌సీపీ పాలనతో లబ్ధిదారులకు క్రమం తప్పకుండా బిల్లులు మంజూరయ్యాయి. పనులు చకచకా జరిగాయి. నేడు ఒక్క అధికారి కూడా పేదల ఇంటి పనులకు సహకరించడం లేదు.

రూ.91 కోట్లు విడుదల

ఏలూరు, దెందులూరు నియోజకవర్గంలో మొత్తంగా నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.91 కోట్లు పేదలకు అందించింది. ఏలూరు నియోజకవర్గంలో ఇంటి నిర్మాణం చేపట్టిన 22.80 వేల మంది లబ్ధిదారులకు రూ.38.17 కోట్లు అందజేసింది. ఇందులో భాగంగా పోణంగి, కొమడవోలు, చొదిమెళ్ల జగనన్న కాలనీల్లో మొత్తంగా 782 మంది ఇళ్లు కట్టుకున్నారు. మరో 851 ఇళ్లు బేస్‌మెంట్, 263 ఇళ్లు గోడలు, 347 ఇళ్లు పునాదుల స్థాయిలో ఉన్నాయి. అధికారులు చొరవతో కాంట్రాక్టర్లు సైతం 2వేల ఇళ్లకు పిల్లర్లు వేసేందుకు గోతులు తవ్వారు. ఇదే క్రమంలో దెందులూరు నియోజకవర్గంలోని పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో ఇంటి పనులు చేపట్టిన 16,989 మంది లబ్ధిదారులకు నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారి ఖాతాల్లో రూ.53.01 కోట్లు జమ చేసింది. దెందులూరు నియోజకవర్గంలో 1,606 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 1,025 ఇళ్లు శ్లాబ్, 586 ఇళ్లు గోడలు, 1,287 ఇళ్లకు పునాదులు, మరో 10,566 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిపోయాయి. ఈ పనులన్నీ ప్రస్తుతం నిలిచిపోయాయి.

బిల్లులు మంజూరు చేయాలి

కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఇల్లు పూర్తి చేస్తాం. నాలుగు నెలలుగా బిల్లు జమ కాలేదు. ఇదేమని అధికారులను అడిగితే, మీరు పూర్తి చేయండి, ప్రభుత్వం బిల్లులు ఇస్తుంది అంటున్నారు. ఇప్పటికే కొంత అప్పు చేశాం. ప్రభుత్వం దయ చూపి బిల్లులు మంజూరు చేయాలి. లేదంటూ మా ఇంటి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోతుంది.

– కె పార్వతి, చాటపర్రు

పేదలకు ఇబ్బంది

పేదలకు మేలు చేయాలంటే చంద్రబాబుకు మనసు ఒప్పదు. అందుకే జగన్ హయాంలో చేపట్టిన పనులన్నీ నిలిపేస్తున్నారు. 6 నెలల క్రితం వరకూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చకచకా జరిగాయి. ఇప్పుడు కాలనీలో పనులన్నీ నిలిచిపోయాయి. దీనివల్ల పేదలు ఇబ్బంది పడుతున్నారు. పేదలకు మేలు చేసేందుకు పాలకులు ఆలోచన చేయాలి. లేదంటే ప్రజల ఆగ్రహం చవి చూడక తప్పదు.

– ఎస్ సత్యనారాయణ, వెంకటాపురం

లిడ్ క్యాప్‌నకు నిధులు మంజూరు చేయాలి

దెందులూరు: లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (లిడ్‌క్యాప్)కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ చర్మకారుల కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన లీడ్ క్యాప్ కార్పొరేషన్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిధులను జోడించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న చర్మకారులు, డప్పు కళాకారుల అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం లిడ్‌క్యాప్ చైర్మన్ కృషి చేయాలని కోరారు. చెప్పులు కుట్టే చర్మకారులు, లెదర్ వర్క్ చేసే కార్మికులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి హెల్త్‌కార్డులు అందజేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్మకారులు, డప్పుకళాకారులతో కలిసి వినతిపత్రాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఉంగుటూరు: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కౌలు చట్టం తీసుకువచ్చి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు కోరారు. ఆదివారం కైకరంలోని తూర్పు వీధిలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22న విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరారు. 22న ఉదయం 10 గంటలకు విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సు నిర్వహిస్తారన్నారు. కేరళ మంత్రి ఎంబీ రాజేష్, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, పలువురు వ్యవసాయ రంగం నిపుణులు పాల్గొంటారని వివరించారు. అన్ని పంటల రైతులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగ సమస్యలపై సదస్సులో చర్చిస్తారన్నారు.

నేత్ర వైద్య శిబిరంలో 135 మందికి పరీక్షలు



ఉచిత నేత్ర వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆదివారం లయన్స్ జిల్లా చైర్ పర్సన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం ప్రతినిధులు ఉచితక నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉషా గ్రూప్ సంస్థల చైర్మన్ వీవీ బాలకృష్ణా రావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 135 మందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 19 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించి వారిని వేమగిరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మరో 36 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ రీజియన్ చైర్మన్ ఉడతా రత్నకుమార్, బెల్లంకొండ మురళి, సుబ్రహ్మణ్యం, చెన్నా వెంకటరామయ్య, బొలిశెట్టి సురేష్ కుమార్, అల్లం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

రేపు భీమడోలులో ఉద్యోగ మేళా

భీమడోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి వాడపల్లి కిషోర్, ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ భీమడోలులో ఆదివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 220 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇన్నోవా షోర్స్, హెట్రో ల్యాబ్స్, బజాజ్ క్యాపిటల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు కలిగి 18 నుంచి 30 ఏళ్ల లోపుగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

పోతునూరులో జ్వరాలపై సర్వే

దెందులూరు: పోతునూరు పీహెచ్‌సీ పరిధిలో ఇంటింటా జ్వరాలు, ఒళ్లనొప్పులు, ఇతర అనారోగ్యాలపై సర్వే చేయిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. కొత్తూరు, పోతునూరులో సర్వే నిర్వహించి జ్వరాలు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారికి వైద్య సిబ్బంది మందులను అందించారు. ఇళ్లకు వస్తున్న వైద్య సిబ్బందికి సహకరించాలని వైద్యాధికారి కోరారు.

విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

గణపవరం: జల్లికొమ్మర యూపీ స్కూల్లో చదువుతున్న 150 మంది విద్యార్థులకు గణపవరం శ్రీదుర్గా డయగ్నోస్టిక్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆ రిపోర్టులను టెక్నీషియన్ నీలపాల శ్రీనివాసరావు వారి తల్లిదండ్రులకు అందించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్ఎం సుందరకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డు మాదిరిగా విద్యార్థులకు అపార్ కార్డు అందిస్తుందని, ఈ కార్డు కోసం బ్లడ్ గ్రూప్ వివరాలు ఆన్‌లైన్ చెస్తామన్నారు. రక్త పరీక్షలు ఉచితంగా చేయడానికి డయాగ్నోస్టిక్ నిర్వాహకులు ముందుకు వచ్చారన్నారు. జల్లికొమ్మర సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, సీహెచ్ లీలాగోపాల్, ఎల్.ప్రసాదరావు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

దెందులూరు: లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (లిడ్ క్యాప్)కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ చర్మకారుల కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన లీడ్ క్యాప్ కార్పొరేషన్‌కు కేంద్రం నిధులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను జోడించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న చర్మకారులు, డప్పు కళాకారుల అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం లిడ్‌క్యాప్ చైర్మన్ కృషి చేయాలని కోరారు. చర్మకారులు, లెదర్ వర్క్ చేసే కార్మికులకు సబ్సిడీ రుణాలివ్వాలని కోరారు.

సమాజ హితులు కళాకారులు



అలరించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన



పేద కళాకారులకు ఆర్థిక సత్కారం చేస్తున్న అతిథులు

- ఏలూరులో ఘనంగా కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం
- పేద కళాకారులకు సత్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కళాకారులు సమాజహితులని, పూర్వకాలంలో సమాజాన్ని మేల్కొలిపి వారిని జాగృతం చేయడంలో కళాకారులు కీలక పాత్ర పోషించేవారని భీమవరం జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రాత్రి నగరానికి చెందిన హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం 47వ కార్యక్రమం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హేలాపురి కళలకు కాణాచి అని ఈ గడ్డపై పుట్టిన అనేక మంది కళాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ఏలూరుకు గర్వకారణంగా నిలిచారన్నారు. కళలను ఆదరించిన నడే సంస్కృతి, సంప్రదాయాలు మనగలుగుతున్నాయన్నారు. తొలుత నట్యాచార్య గండికోట రాజేష్ సమక్షంలో జాహ్నవి లాలిత్య బృందం ప్రదర్శించిన స్వాగత నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకుంది. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా చిన్నారి ఎల్.శాశ్వత్ ప్రదర్శించిన శ్రీ ఆంజనేయ పాత్రలో పలికించిన పద్యాలు ప్రేక్షకుల రంజింపజేశాయి. అనంతరం సత్రంపాడుకు చెందిన శ్రీ రామాంజనేయ నాట్య మండలి బృందం ప్రదర్శించిన రాయభారం (సెంట్రల్ సీను) సన్నివేశంలో రంగస్థల కళాకారులు వల్లించిన పద్యాలు ప్రేక్షకులను ఆనందపరిచాయి.

పలువురికి సత్కారం

ఈ సందర్భంగా నగరానికి చెందిన గుప్తా ఫౌండేషన్ ట్రస్టు ఆర్థిక సహకారంతో రంగస్థల కళా రంగంలో ఆర్థికంగా వెనుకబడిన పౌరాణిక నటులు పిల్లి శౌరి, బి.రామారావు, డప్పు కళాకారుడు ఈ. లక్ష్మణరావు, పౌరాణిక నటి బి.వాణిని ఆర్థికంగా సత్కరించారు. సంస్థ తరపున పౌరాణిక రంగస్థల కళాకారుడు వి. రామాంజనేయ సిద్ధాంతికి గౌరవ సత్కారం చేశారు. సన్మాన గ్రహీతలకు బీవీ రోషన్ పట్టాభి వర్మ నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ సందర్భంగా ఇటీవల దివంగతుడైన కళాకారుడు సంపంగి వేంకటేశ్వరరావు భార్యకు ఆర్థిక సత్కారం చేసి నూతన వస్త్రాలను సంస్థ నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వంకినేని భానుప్రకాష్, సంస్థ అధ్యక్షులు పెదపాటి రామకృష్ణ, గుప్తా ఫౌండేషన్ మేనేజర్ కే. శ్రీనివాస్, పైడి భీమేశ్వరరావు, గండికోట రాజేష్,ఎండీ ఖాజా వలీ, ఎం. సూర్యనారాయణ యాదవ్, ఎస్. కస్తూరిరావు, కేవీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పి. విజయకుమార్, సహాయ కార్యదర్శులు సంకు సురేష్, మండవ రాజగోపాలకృష్ణ, వై. అర్జున రావు, కార్య నిర్వాహక కార్యదర్శులు, కోశాధికారి, సభ్యులు కళాభిమానులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి
- నేటి నుంచి సంస్మరణ వారోత్సవాలతో ఘన నివాళులు



ఏలూరు పోలీస్ గ్రౌండ్స్‌లోని అమరవీరుల స్థూపం

ఏలూరు టౌన్: దేశ సరిహద్దులో విదేశీ శత్రువులను ఎదుర్కొంటూ పహారా కాస్తూ ప్రాణాలొడ్డుతున్న సైనికులు.దేశంలో అంతర్గత భద్రతకు అహోరాత్రులు శ్రమిస్తూ విధుల్లో ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న పోలీసులు. అటు సైనికులు, ఇటు పోలీసులు ప్రజలకు శాంతిభద్రతలు, రక్షణ కల్పిస్తూ తమ విధులను నిర్వర్తిస్తున్నారు. ఇక అంతర్గత శత్రువులు, సంఘ విద్రోహశక్తులు, మావోయిస్టులు..ఇలా సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించటం కత్తిమీదసాము లాంటిదే. పోలీసులు ప్రజలకు నిరంతరం రక్షణ కవచంలా నిలుస్తున్నారు. పోలీసు సిబ్బంది, అధికారులు నిత్యం ప్రజాసేవలో పనిచేస్తూ ఒక్కోసారి విధుల్లో తమ ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను పోలీసు శాఖ, ప్రజలు గుర్తిస్తూ సంస్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. పోలీసు అమరవీరుల సేవలను గుర్తు చేసుకుంటూ సంస్మరించుకోవటం ఆనవాయితీగా వస్తోంది. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని 1960 అక్టోబర్ 21వ తేదీ నుంచి ఏటా నిర్వహిస్తారు.

అమరవీరుల త్యాగాలు

ఏలూరు జిల్లా నూజివీడు సర్కిల్ పరిధిలోని ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ గంధం నరేంద్ర దుండగుడి దాడిలో మృతి చెందారు. ఉత్సవాల ఊరేగింపులో శాంతిభద్రతల పరిరక్షణకు విధుల్లో ఉంటూ ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ నరేంద్ర కుటుంబానికి పోలీస్ శాఖ అండగా నిలిచింది. జిల్లాకు చెందిన ఇద్దరు గ్రేహౌండ్స్ కానిస్టేబుల్స్ మావోయిస్టు ఎదురుకాల్పుల్లో మరణించారు. 2008లో ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైన బలిమెల వద్ద మావోయిస్టులు గ్రేహౌండ్స్ దళాల మధ్య కాల్పుల సంఘటన చోటు చేసుకుంది. ఈ కాల్పుల్లో జిల్లాకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. ఏలూరు దక్షిణపువీధికి చెందిన చోడే సుబ్బారావు , భీమవరానికి చెందిన పిల్లి సుధీర్‌బాబు మావోయిస్టులతో జరిగిన పోరులో అసువులు బాసారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి

జిల్లా శాఖలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది, అధికారుల సంక్షేమానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూ.కోటి ఎంపీ నిధులతో రిజర్వ్ బలగాలకు డార్మిటరీ నిర్మాణం, సబ్సిడరీ క్యాంటీన్, మార్కెట్ కంటే తక్కువ ధరలకు కన్స్యూమర్ స్టోర్, పోలీస్ పెట్రోల్ బంక్, శారీరక దారుఢ్యాన్ని కాపాడుకునేందుకు ఆధునిక జిమ్, వైద్య సదుపాయానికి ఆసుపత్రి, గ్యాస్ గోడౌన్, కల్యాణ మండపాలు, పిల్లల చదువులకు పాఠశాలలు ఉన్నాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీసుల సంక్షేమానికి, అభివృద్ధికి వినియోగిస్తున్నారు.

పోలీసులంటేనే త్యాగం



పోలీసులంటేనే త్యాగమని, ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే పోలీస్ పాత్ర కీలకమైంది. సమాజంలో అంతర్గత శత్రువులతో నిరంతరం పోరాటం చేస్తూ ఉండాల్సిందే. ప్రజలకు శాంతి, భద్రతలు అందిస్తూ అహోరాత్రులు కష్టపడేవారే పోలీసులు. కుటుంబాలను సైతం పక్కనపెట్టి తమ ప్రాణాలను లెక్కచేయకుండా విధి నిర్వహణలో ఉంటున్న ప్రతి పోలీసు సిబ్బంది, అధికారి సేవలు స్ఫూర్తిదాయకం. పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నాం.

– జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ ఐజీ

అమరవీరులకు ఘన నివాళులు



సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు శ్రమిస్తూ, 24గంటలూ ప్రజా సేవలో ఉంటూ ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు అందరూ ఘనంగా నివాళులర్పించాలి. అనేక ఒత్తిడిలను తట్టుకుంటూ విధుల్లో రాజీలేకుండా పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సేవలను అభినందించాలి. తమ ప్రాణాలను కోల్పోయిన ప్రతి పోలీస్ సిబ్బందిని పోలీసు శాఖ ఎప్పటికీ మర్చిపోదు. వారి కుటుంబాలకు అంతా బాసటగా నిలుస్తాం.

– కొమ్మి ప్రతాప్ శివకిషోర్, ఏలూరు జిల్లా ఎస్పీ

సంక్షేమానికి ప్రాధాన్యత



ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ సారథ్యంలో పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్నాం. సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. మృతిచెందిన కుటుంబాలను ఆదుకునేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేసి ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారు.

– ఆర్.నాగేశ్వరరావు, పోలీసుసంఘం జిల్లా అధ్యక్షుడు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	10
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు - తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40-46	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	56-96
వంకాయలు (కాంతులు)	60	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36-60	ములక్కాడలు	07,10
బెండకాయలు	32	కంద	60
పచ్చిమిర్చి	40-44	బీట్‌రూట్	44-48
కాకర కాయలు	32-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	40	అల్లం	80-150
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	40-48	పాలకూర	12
దొండకాయలు	28	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	30-44	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	34-44	బఠాణీ	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40